


తనను దుల్హాన్‌పాషా పిలుస్తున్నాడని విన గానే తుళ్ళిపడ్డాడు. పాషా. దిగ్గున తలెత్తి చూశాడు. గుమ్మంలో తలుపుకానుకుని నిలుచుని ఉంది చమ్కీ, చిలిపిగానవ్వుతూ, తననిమింగేసేట్టు కవ్వింపుగా చూస్తూ.

[illegible] కొచ్చాయి పాషాకు. అది ఎప్పుడూ ఇంతే. ఏపున ఎదిగిందన్న మాటేగాని బొత్తిగా పిల్లకాయతనం పోలేదు. తనని చూడగానే రెచ్చిపోతుంది. 'ఢీ' కొట్టింది పూర్వోక్కడు. కిలకిలా నవ్వుతూ పారి పోతుంది. అది చూసి నౌకర్లంతా తనని ఎగతాళి పట్టిస్తారు. వాళ్ళకి తోడు దాని తల్లి రజ్జాబీ [illegible] ( [illegible] ) తుంటి మంటి నవ్వుల్తో దాన్నింకా పురికొల్పుతూంటుంది. చాటుమాటుగా మంచి మంచి వంటకాలు చమ్కీ చేత తనకు పంపిస్తూంటుంది. చమ్కీని తనకు అంటగట్టా లని ముసలిదాని ఆశ. అది తెలిసినప్పటి నుంచీ వాళ్ళంటే మరీ ఏవగింపుగా ఉంది పాషాకు. చమ్కీని తప్పించుకు తిరగలేక చచ్చి పోతున్నాడు.

"ఏమిటి, అలాచూస్తున్నావ్?.. ..బావున్నావా?

అంటూ వంకర్లు పోయింది చమ్కీ, దుపట్టా జారవిడుస్తూ.

"ఛీ! పో. . ." అంటూ గద్దించాడు.

జవాబుగా కిలకిల నవ్వింది చమ్కీ. "దా,దా దుల్హన్ పాషా వెంటనే రమ్మన్నారు" అంటూ తుర్రుమంది.

పాషా ఆలోచనలో పడ్డాడు. దుల్హన్ పాషా! నవాబ్ పాషా భార్య దుల్హన్ పాషా! !. . .తనకేమీ కొత్తకాదు. ఇప్పుడు ఇంటికి కోడలుగా వచ్చింది కాని, అసలు ఈ ఇంట్లోనే పుట్టి పెరిగింది. నవాబ్‌పాషా బాబాయి చోటే నవాబ్ కూతురుగా ఈ ఇంట్లోనే పుట్టింది. అల్లారుముద్దుగా పెరిగింది. చిన్నప్పు బొద్దుగా అచ్చంగా కర్పూరం బొమ్మలాగే ఉండేది. అసలు పేరు ఏం పెట్టారో గాని, అందరూ 'గుడ్డిరాణీ' అని పిలిచేవారు. ఏన్నోసార్లు తనను 'గుర్రం' చేసి వీపు మీద ఎక్కించి తిప్పారు. కాస్త పెద్దయాక నవాబ్‌పాషా, గుడ్డిరాణీ, తానూ అప్పుడప్పుడూ తోటలో ఆడుకునే వారు. 'పాచా, 'పాచా' అంటూ తన వెంట తిరిగేది. అది చూసి ఓర్వలేక నవాబ్ పాషా తనను తిట్టేవాడు, కొట్టేవాడు. గుడ్డిరాణి నవాబ్ పాషాతో కలియపడేది: రక్కేది, ఏడ్చేది. వెళ్ళి అమ్మతో ఫిర్యాదు చేసేది. . .అలా అయిదారేళ్ళు గడిచాయి.

ఆ తర్వాత, ఉద్యోగ రీత్యా చోటే నవాబ్ మరో పట్టణానికి కాపురం మార్చాడు. ఇప్పటికీ అక్కడే ఉన్నాడు. పది పన్నెండేళ్ళవరకూ గుడ్డిరాణి మళ్ళీ కంటపడ లేదు. ఇప్పుడు అమాంతంగా, ఈ ఇంటి కోడలుగా, నవాబ్ పాషా భార్య దుల్హన్‌పాషాగా వచ్చింది. బాగా ఎదిగిపోయి ఉంటుంది. తాను పోల్చుకోలేనంతగా మారిపోయి ఉంటుంది. ఎలా ఉందో చూడాలని మనసు తహతహలాడింది. కాని జనానాలోకెళ్ళటానికి ధైర్యం చాల లేదు. జనానా తనకు కొత్త కాదు. చిన్నప్పటి నుంచీ వెళ్తూనే ఉన్నాడు. కాని నవాబ్‌పాషా పెళ్ళి చేసుకుని తిరిగి రాగానే కాళ్ళకు బంధాలు పడ్డాయి. ఎవరూ రావద్దని అనలేదు. కాని తనకే ధైర్యం చాలలేదు. ఇప్పుడు దుల్హన్‌పాషా స్వయంగానే తనను పిలిపించిందట! అంటే చిన్నప్పటి గుడ్డిరాణికి తానింకా జ్ఞాపకమున్నానా? తననిప్పుడు పోల్చుకోగలదా? చిన్నప్పటి 'గుర్రం' ఇప్పుడు నిజంగానే గుర్రంలాగా కండలు తేలి ఎదిగిన తనను పోల్చుకోగలదా?. .

"అరె, పాషా, నువ్వింకా ఇక్కడే ఉన్నావ్? అవతల అమ్మగారు నన్ను కోప్పడుతుంటే. . ." మళ్ళీ వచ్చింది చమ్కీ.

చెంగున లేచి నిలుచున్నాడు పాషా. ముందుకు అడుగు వేశాడు. గుమ్మంలో కదలకుండా నిలుచుని ఉంది చమ్కీ. "లే, లే" అన్నాడు. కాని అది కదల్లేదు. దాన్ని తాకకుండా ప్రక్కకు ఒదిగి పోవాలని చూశాడు. కాని సరిగ్గా సమయానికి ముందుకు ఒరిగి తన గుండెల్ని తాకించింది చమ్కీ. "ఛీ, ఛీ!" అంటూ విదిలించుకుని ముందుకు సాగాడు. వెనకాల పెద్దగా నవ్వూ, 'బుద్ధూ' అన్న మాటలు వినిపించాయి. వాటిని లెక్క చేయకుండా సాగిపోయాడు.

జనానాఖానా గుమ్మం దగ్గర చప్పున ఆగిపోయాడు. పరదాకు ఈవలె నిలుచుని, గొంతు సవరించుకుని, "బేగంసాబ్! నేను రావచ్చా?" అన్నాడు.

లోపల్నించి "ఎవరూ?. . .పాషా?. ." అన్న మధుర కంఠం వినిపించింది.

"జీ" అన్నాడు.

"రా, రా. . ."

అతి వేగంగా కొట్టుకుంటున్న గుండెను అదిమి పట్టి, పరదాను తొలగించుకుని, లోపలికి అడుగు వేశాడు.

ఎదురుగా వరండాలో బల్ల మీద మఖమల్ తివాసీ మీద ఇదివరకు నవాబ్ బేగం కూచునే చోట అచ్చం ఆమె లాగే, ముందొక వెండి పాందాన్ పెట్టుకుని కూచుని ఉంది ఒక నవయౌవన సుందరాంగి. అద్భుత రంగు సాటిన్ గుడ్డ షల్వార్, కమీజు, తలపైన జలతారు చుక్కలు చెక్కిన సన్నని ఆకు పచ్చ దుపట్టా, నల్లని జుత్తు మధ్య తెల్లని పాపిటను కప్పిన బంగారు గొలుసూ, దాని చివర నొసట వేళ్ళాడుతూన్న పతకమూ, చెవులకు బంగారు ఝుమ్కాలు, రవ్వ ముక్కు పుడకా, తెల్లని మెడకు అతుక్కు పోయిన రంగు రంగుల రాళ్ళ నెక్లేసు, చేతులకు దట్టంగా బంగారు గాజులూ, వేళ్ళకు ఉంగరాలూ, కాళ్ళకు పాంజేవులూ, అరచేతులకూ, పాదాలకూ పారాణీ—ఒకకాలు ముడుచుకుని, మోకాలు మీద చెయ్యి ఆనించి, కొత్త పెళ్ళి కూతురు వేషంలో కూచుని తననే తదేకంగా చూస్తూ ఉంది... ఈమేనా గుడ్డిరాణి? కాదు, కాదు—దుల్హన్‌పాషా?...



పొట్టకోసం
చిత్రం— ఎస్.ఎ.ఆర్.ఎస్. సాయికుమార్

కళ్ళు దించేసి, వంగి సలాం చేసి చేతులు కట్టుకుని నిల్చున్నాడు పాషా.

"అరే, పాషా! నువ్వేనా? రా... ఎంత పెద్ద వాడివై పోయావ్? నేను గుర్తే పట్టలేకుండా ఉన్నాను" అన్నది ఆప్యాయంగా.

పాషా ఇబ్బందిగా కదిలి, మౌనంగా ఉండి పోయాడు. కొద్ది క్షణాలు నిశ్శబ్దంగానే గడిచి పోయాయి.

"ఇటు చూడు" అంది దుల్హన్ పాషా.

చూశాడు. ఎప్పుడు చేరుకుందో, ఆ పక్కనే గోడనానుకుని నిల్చుని ఉంది చమ్కీ. పూర్వం నవాబ్ బేగంకు దాసీగా ఉండేది. ఇప్పుడు దుల్హన్ పాషాకు దాసీగా కుదురు కున్నట్టు ఉన్నది.

"నన్ను గుర్తు పట్టావా, పాషా?"అంటూంది దుల్హన్ పాషా, చిరునవ్వులో. "నేనింకా చిన్నప్పటి గుడ్డి రాణీ గానే ఉన్నానా?.... చిన్నప్పుడు మనం కలిసి ఎన్ని ఆటలు ఆడుకునే వాళ్ళమో జ్ఞాపకముందా?"

అవునన్నట్టు తలూపాడు.

"ఏరా నీ కింకా మాటలు రావా? నువ్వు చిన్నప్పుడూ ఇంతే..."

"ఏం మాట్లాడను?"

చెంప ఛెళ్ళుమంది—ఉలిక్కిపడి చూశాడు. ఎదుట నవాబ్‌పాషా!...

"బద్మాష్! నువ్వర్‌కే బచ్చే! నీ కింత సాహసమా? జనానాలో కొస్తావా?" అంటూ మళ్ళీ కొట్టాడు.

"అరెరే! అదేమిటి వాణ్ణి కొడ్తారే? నేనే పిలిపించాను —" అంటూంది దుల్హన్‌పాషా.

"నడూ, బద్మాష్! బయటికి నడూ" అంటూ ఒక్క తోపు తోశాడు నవాబ్ పాషా.

పాషా హృదయంలో కోపం ఉవ్వెత్తున లేచింది—తలచుకుంటే ఒక్క గుద్దుతో ఆ ఒక్క ప్రాణి ప్రాణం తీసెయ్యగలడు... కాని...కాని, తాను నౌకరు: వాడు యజమాని!... అంతా దిగమింగి, గబగబా ఈవల కొచ్చేశాడు. లోపల భార్యాభర్తలు ఘర్షణ పడుతున్నారు.

గదిలో కొచ్చి నేలపై కూలబడి మోకాళ్ళ మీద తల ఆన్చి కూచున్నాడు. కోపాగ్నిలో ఒళ్ళు దహించుకు పోతూంది. వాడు కొట్టిన దెబ్బలకు కాదు బాధ అందరి ముందూ, ముఖ్యంగా దుల్హన్ పాషా ముందూ,అవమాన పరచినందుకు భరించరాని బాధ కలుగుతూంది. 'రండ నేధవ! ఊఫ్ అంటే పూగిపడే పూచిక పుల్లలాంటివాడు, వాడేంకొడతాడు తనను? కాని — కాని, నువ్వర్‌కా బచ్చా అని తిడతాడా?... తాను పంది కొడుకైతే మరి వాడెవడో...?

నవాబ్ పాషాకు తనకు, బద్ధ వైరం. అది ఈ నాటిది కాదు. పుట్టుకతోనే అంకురించిందేమో! ఇద్దరూ రెండు మూడు నెలల తేడాతో పుట్టారట.

దేవి పిల్సు
REGD.
వాడండి ముఖ్యంగా ఆలస్యమైన,
క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన,
లేక ఆగిపోయినబహిష్టకు
ప్రకృతిలోనుఆరోగ్యమునకు ఎట్టిహానికలిగింపదు
SEALED PACKING 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO. MADRAS-1

ఉచితం! ఉచితం!!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఏ రంగు రంగైనా మా ప్రఖ్యాత మందు వాడిన కొద్ది రోజులలో మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారము నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి చిరునామా:
BHARAT AYURVEDASHRAM,
P.O. Katri Sarai (Gaya)

మీకు బేబీ / బాబు కావాలా



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీ మణులు అనేకులు మా మందులచే సంతానవంతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు. ఉచిత వివరములకు
శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వే స్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తెనాలి - 2.

నవాబ్ పాషాకు తన తల్లి లచ్చాయే పాలిచ్చేది. తనకు జ్ఞాపకమున్న మొట్ట మొదటి దృశ్యం ఈ జన్మలో మరిచిపోలేడు. అమ్మ లచ్చా ఒళ్ళో పడుకుని కుడి రొమ్ము చీకుతునాడు. నవాబ్ పాషా. తానూ మారాం చేస్తూ ఎడమరొమ్ము కోసం ఎగ్రబాకాడు. అది చూసి ఓర్వలేక నవాబ్ పాషా తనను తంతూ, పెద్దగా ఏడ్పు లంఘించుకున్నాడు. అది వినగానే వాడి తల్లి నవాబ్ బేగం పరుగెత్తు కుంటూ వచ్చింది. తనను దూరంగా లాగేసి చరిచి అమ్మనూ తననూ తిడుతూ కొడుకును చంక నేసుకుని వెళ్ళిపోయింది. అమ్మకిక్కురుమనకుండా తల వంచుకుని ఏడుస్తూ కూచుంది. ఆ తరవాత అమ్మ నవాబ్ పాషాను ఎప్పుడూ గదికి తీసు కొచ్చేది కాదు జనానాలోకే వెళ్ళి పాలిచ్చి వచ్చేది. తనకు ఆట్టే పాలు మిగిలేవి కావు.

కొన్నాళ్ళకు అమ్మకు పాలు ఉడిగిపోయాయి. దాంతో నవాబ్ పాషాకు పాలిచ్చేబాధ తప్పిపోయింది ఆ తరవాత అమ్మను. అప్పటికే బాగా ముసలిదై యిన మామా (వంట మనిషి) చేతి కిందవేశారు. ఆ ముసల్ది చనిపోయాక అమ్మే మామా అయింది. ఆ మార్పు తన మంచికే జరిగింది. దొంగ చాటుగా అమ్మ తెచ్చే తిండన్నీ తినేవాడు. ఏది దొరికితే అదే తిని హరించుకునేవాడు. బాగా ఒళ్ళు పట్టాడు. అటు నవాబ్ పాషా ఎంత మంచితిండ్లూ, పండ్లూ తిన్నా రోగాలతో సతమతమవుతూ సీలగా, పీరులాగా తయారయాడు. ఆ కోపం కొద్దీ ఆటల్లో తనమీదికి మాటి మాటికీ లంఘించే వాడు. కొట్టేవాడు. తాను నవ్వుతూ నిల్చుంటే కోపం పట్టలేక ఏడుపు రాగాలు తీసి, వెళ్ళి నవాబ్ బేగంకు పిర్యాదు చేసేవాడు. ఆమె వెంటనే తనను, రప్పించి, బాగా తిట్టి, ఇతర నౌకర్ల చేత కొట్టించేది. ఆసమయాల్లో గుడ్డిరాణి దూరాన నిలుచుని తనను జాలిగా చూస్తూండేది. ఆ అమ్మాయి చూస్తూందన అభిమానం కొద్దీ ఎంత తిట్టినా, ఎంత కొట్టినా కంట నీరు పెట్టే వాడు కాదు.

నవాబ్ బేగంకు తనంటే, అమ్మ లచ్చా అంటే బొత్తిగా గిట్టేది కాదు. కనపడ్డప్పుడల్లా తిడుతూ ఉండేది. అందుకే అమ్మ ఆమె కంటపడకుండా తప్పించుకు తిరుగుతూండేది—వంట పనేదో అయి పోగానే గదికొచ్చేసేది. ఇతర నౌకర్లతో కబుర్లాడుతూ కూచోటంగాని, బేగం సాహెబ్ మెహర్బానీ కోసం తాపత్రాయ పడడం కాని చేసేది కాదు.

నవాబ్‌సాబ్ చాలా మంచివాడు. ఎప్పుడూ పల్లెత్తు మాట ఎవర్నీ అనేవాడు కాదు. అతని కళ్ళలో దయాదాక్షిణ్యాలు తొణికిసలాడుతూండేవి. బేగంసాబ్ తాకిళ్ళ నించి తనని తప్పించటానికి కూడా అప్పుడప్పుడు ప్రయత్నం చేసేవాడు. పాషా కాస్త పెద్ద వాడయాక తన ప్రత్యేక నౌకరుగా నియమించుకున్నాడు. అప్పట్నించీ దివాన్‌ఖానాను శుభ్రపరచడం, తివాసీలూ, దుప్పట్లూ, దిండ్లూ దులిపి వెయ్యటం, హుక్కా తయారు చేయటం బూట్లు పాలిష్ చెయ్యటం, స్నానానికి నీళ్ళు తోడటం, బట్టలు అందివ్వటం, నవాబ్‌సాబ్ భుక్తాయాసం తీర్చుకుందుకు ఒరిగినప్పుడు కాళ్ళు పట్టటంలాంటి పనులతో అతని సేవలోనే గడిపేవాడు. జనానాలోకి అడుగు వెయ్యడానికే భయంగా ఉండేది. తప్పని సరిగా వెళ్ళినప్పుడు తిట్లూ తప్పేవి కావు.

నవాబ్ బేగం కంటే నవాబ్ పాషా ప్రవర్తనతో చాలా బాధ కలిగేది. ఏదో ఒక వంక పైన ఎప్పుడూ తనను అవమానిస్తూనే ఉండేవాడు. రానురాను వాటికి అలవాటు పడే బదులు, భరించరానంత బాధ పడేవాడు. పెద్దవాడైనకొద్దీ ఈ మనోవ్యథ మరీ హెచ్చింది. . .ఎందుకు? ఎందుకు ఇన్ని తిట్లు, దెబ్బలు, అవమానాలు భరిస్తూ ఇక్కడ పడుండాలి? ఈ మాత్రం చాకిరీ బయట చేసుకుంటే బ్రతక లేమా? అనిపించేది. ఆ మాటే అమ్మతో అంటే "ఖర్మరా, బాబూ! ఖర్మ!" అంటూ నొసలు బాదుకునేది. "మనం బానిసలంరా, బానిసలం! మన గతి ఇంతే" అనేది. తన కేమీ అర్థంగాక, విసుగూ, కోపంతో హతాశుడై పోయేవాడు.

ఇంతకూ తన తండ్రి ఎవరో తెలీదు పాషాకు. ఎప్పుడూ చూళ్ళేదు. అమ్మని అడిగితే జవాబు చెప్పకుండా ఏడుస్తూ కూచునేది. ఇతర నౌకర్ల ద్వారా తెలిసింది నవాబ్‌సాబ్ గుర్రపు బగ్గీ తోలే బుడఖాన్ సైస్ అట తన తండ్రి. . .తాను గర్భంలో ఉండగానే ఎటో పారిపోయాట్ట. మళ్ళీ పత్తా లేదు. అమ్మను ఎంత అడిగినా ఏమీ చెప్పేది కాదు. పైగా బుడన్‌ఖాన్‌ను నాలుగు తిట్లు పోసి, మెటికలు విరిచేది. అంతా అయోమయంగా ఉండేది పాషాకు.

తన చిన్నప్పుడు అమ్మ అందంగానే ఉండేది. రంగు నలుపే అయినా, మొహం తీర్చి దిద్దినట్లుగా కళకళలాడుతూ ఉండేది. కాని రాను రాను ఆ కళ కాస్త కరిగి పోయింది. బక్కచిక్కటం మొదలెటింది. దగ్గు కూడా మొదలైంది. ఒక్కొక్కసారి నీరసం వచ్చి పడిపోతూ ఉండేది. ఒకసారి వంట చేస్తూ ఉండగా దగ్గు పొర వచ్చి ఉమ్మేసరికి నెత్తురు పడ్డదట. ఆ విషయం తెలియగానే నవాబ్ బేగం అమ్మను మళ్ళీ వంట గదిలో అడుగు పెట్టనివ్వ లేదు. రజ్జాబీని మామాగా కుదుర్చుకుంది. రజ్జాతో బాటు దాని కూతురు చమ్మీ కూడా వచ్చి దేవిడీలో ఉండి పోయింది.

లచ్చా అంటే నౌకర్లందరికీ అభిమానమే. రజ్జాబీ కూడా అమ్మకూ, తనకూ కడుపునిండా అన్నం పెట్టేది. అయినా అమ్మ పరిస్థితి దిగజారు తూనే వచ్చింది.

ఆఖరికి ఆరాత్రి అమ్మ మరీ బాధ పడుతూంది. దగ్గు పొరమీద పొర వస్తూంది. ఆయాసంతో రొప్పుతూంది. బాధ నోర్వలేక మూలుగుతూంది. సాయంత్రమే హకీంసాబ్ దగ్గర మందు గోలీలు తెచ్చివేశాడు. అమ్మ బాధ చూడలేక మళ్ళీ వెళ్ళాడు ఒక్కమాటు వచ్చి చూడమని బ్రతిమాలాడు. కానీ హకీంసాబ్ ఇంత రాత్రి రాలేననీ, పొద్దున వచ్చి చూస్తానులెమ్మనీ తరిమేశాడు. ఇక చేసేది లేక బిక్కమొహంతో అమ్మ ప్రక్కనే కూచున్నాడు. అమ్మ అంత ఆయాసంలోనూ తనను పడుకోమనీ, నిద్ర పొమ్మనీ పదే పదే కోరుతూంది. కాని పాషాకు నిద్ర ఎలా పడుతుంది? అలాగే కూచున్నాడు. అది గమనించేనేమో, తన కోసమేనేమో అమ్మ కాస్త తమాయించుకుంది. మూల్గటం మానేసింది.

పాషా మనసు కాస్త స్థిమిత పడ్డది. కాసేపట్లోనే నిద్ర ముంచుకొచ్చింది. అక్కడే ఒరిగిపోయాడు.

అలా ఎంతసేపు నిద్రపోయాడో. తెలీదు. దిస్సున మెలుకవ వచ్చింది. అంతా చీకటి— ఏదో మగ గొంతుక గుసగుసగా వినిపించగానే లేవబోయాడు. కాని అది నవాబ్‌సాబ్ గొంతు అని గ్రహింపు కలగ్గానే ఆశ్చర్యంతో అలాగే ఉండిపోయాడు.

నవాబ్‌సాబ్ అంటున్నాడు—"అచ్చా! నేను నీకు అన్యాయం చెయ్యను. బాగు చేయిస్తాను తప్పకుండా నీకు బాగు చేయిస్తాను. రేపే నిన్ను ఆసుపత్రిలో చేర్పిస్తాను. మంచి డాక్టర్లకు చూపిస్తాను. త్వరలోనే నీకు నయమై పోతుంది. నువ్వేం భయపడకు —"

అమ్మ ఇదేం వినిపించుకోటం లేదు. "పాపా, పాపా..."అంటోంది.


"పాపాకేం భయం లేదు. నేనున్నాగా? వాడి భవిష్యత్తుకి అండగా నేను నిలుస్తాను—నువ్వు నిశ్చింతగా ఉండు... పడుకో—పొద్దుపోయింది. రేపు పొద్దున్నే నిన్ను ఆసుపత్రికి తీసుకెళ్తాను. వస్తా..." అంటూ లేచి వెళ్ళిపోయాడు.

అమ్మ పెద్దగా నిట్టూర్చింది.

పాపా కేమీ అంతు పట్టలేదు. నవాబ్ సాబ్‌కూ, అమ్మకూ ఏమిటి సంబంధం అన్న అనుమానం తీరక ఆలోచనల్తో బుర్ర వేడెక్కిపోయింది. మళ్ళీ ఎప్పుడు నిద్రలోకి జారుకున్నాడో తెలీనేలేదు.

"పాపా, పాపా" అంటూ ఎవరో కుదుపుతోంటే లేచి కూచున్నాడు. గదంతా నౌకర్లతో నిండి ఉంది. ప్రక్కకు తిరిగి చూశాడు —అమ్మ పడుకుని ఉంది. మొహం నిండా దుప్పటి కప్పేసి ఉంది. ఏం జరిగిందో గ్రహించుకోగానే "అమ్మా" అంటూ కేకపెట్టి అమ్మ మీద పడి పెద్దగా రోధించటం మొదలెట్టాడు. అందరూ ఓదార్చారు. నౌకర్లందరిలోకీ పెద్దవాడు బాబా పాపాని బలవంతాన లేపు కెళ్ళి బయట చెట్టు కింద కూచోబెట్టి, అనునయంగా వీపు నిమురుతూ ప్రక్కనే కూచున్నాడు. మోకాళ్ళ మీద తల ఆన్చి వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉన్నాడు పాపా.

లోపల్నించి నవాబ్ సాబ్ గానీ, బేగం సాబ్ గానీ వచ్చి చూసి పట్టులేదు. కాని శవాన్ని త్వారగా ఎత్తెయ్యమని ఆదేశం పంపింది బేగంసాబ్. అచ్చా హిందువా, ముస్లిమా? దహనం చెయ్యాలా, ఖననం చెయ్యాలా? అన్న చర్చ మొదలైంది. ఏడుపు ఆపి వింతగా వింటున్నాడు పాపా ఆఖరికి అచ్చా బుడన్‌ఖాన్‌ని నికా చేసుకున్నది. కాబట్టి ముస్లిమేనని తేల్చారు. తతంగమంతా జరిపించారు. బొందలగడ్డకి పాపాని తీసుకెళ్ళారు బొందలో శవాన్ని దించాక, మొహంపై నించి గుడ్డను తొలగించి, ఆఖరిసారిగా అమ్మను చూడమని తనను దగ్గరికి తీసుకెళ్ళారు. అమ్మ మొహం చూడగానే ఇంతసేపూ అదిమి పట్టిన దుఃఖం కట్టలు తెగింది. "అమ్మా" అంటూ తానూ బొందలోకి దూకబోయాడు. పట్టుకుని, దూరంగా తీసుకెళ్ళి అరుగుమీద కూచోబెట్టాడు. బొందపూడ్చే




శారు. అందరూ ఇంటికి బయలుదేరారు. తనవూ లేవదీయ డానికి ప్రయత్నం చేశారు. కాని ఎవరు చెప్పినా రానని మొండి కేసుకుని అక్కడే కూచున్నాడు. అందరూ వెళ్ళిపోయారు. ఒక్క బాబా తప్ప బాబా పాపా పక్కనే కూచున్నాడు. మౌనంగా. అలా చాలా సేపు కూచున్నాక అన్నాడు బాబా — పద బాబూ! పోదాం, పద. పొద్దు బోతోంది."

"ఎక్కడికి?"

"ఇంటికి"

"హు, అది ఇల్లు కాదు. అమ్మలేంది ఇల్లేమిటి? నేను రాను"

"పొరబాటు, బాబూ! అదే నీ ఇల్లు. నీకు మరో ఇల్లు లేదు."

పాపా అనుమానంగా బాబా కేసి చూశాడు. రాత్రి మొలకెత్తిన సందేహం మళ్ళీ తలెత్తింది.

"బాబా! నే నొకటి అడుగుతాను చెబుతారా?"

"అడుగు, బాబూ. ఎందుకు చెప్పను?"

రాత్రి జరిగిన సంఘటనంతా చెప్పాడు. పొద్దున తన తల్లి హిందువా, ముస్లిమా అన్న చర్చ గురించి కూడా ప్రస్తావించాడు చివరికి "ఇదంతా ఏమిటి బాబా? అసలు నేనెవరం?" అని అడిగాడు.

బాబా కొద్ది క్షణాలు శూన్యంలోకి చూసి అన్నాడు. "చెబుతాను—అంతా చెప్పేస్తాను... నీ అమ్మ అచ్చా పుట్టింది హిందువుల ఇంట్లోనే గొల్లవాళ్ళ పిల్ల. చిన్నప్పుడే పెళ్ళైంది. దేనికి దగ్గర్లోనే మొగుడితో ఉండేది. నవాబ్‌సాబ్‌కు పెళ్ళయిన చాలాకాలం వరకు పిల్లలు కలగలేదు. ఆ రోజుల్లో నవాబ్ గారి మనసు కొంచెం చంచలంగా ఉండేది. అందమైన ఆడవాళ్ళు చూస్తే చలించిపోయేవాడు. యౌవనంలో ఉన్న అచ్చా మీద కన్నుపడ్డది. అతని అందానికీ, డబ్బుకూ లొంగి పోయింది. ఈ విషయాలు ఆట్టే కాలం దాగవు. ఆమె భర్తకు తెలిసి పోయింది. తన్ని తరిమేశాడు ఇంట్లోంచి. ఏడ్చుకుంటూ నా దగ్గరికొచ్చింది. నవాబ్ గారి ఆదేశానుసారం నా దగ్గరే అట్టే పెట్టుకున్నాను. నాకు తెలిసిన వాళ్ళ పిల్ల అనీ. భర్త చనిపోయాడనీ. ఇంకెవ్వరూ లేరనీ అమ్మగారితో చెప్పాను. కొన్నాళ్ళ తరవాత. అచ్చాకి నెలతప్పిందని తెలిసి నవాబ్ గారు గాభరాపడ్డారు. వెంటనే ఒక స్నేహితుడి దగ్గర పని చేస్తున్న బుడన్‌ఖాన్‌ను తెచ్చి, తన దగ్గర ప్యూన్‌గా ఉద్యోగమిచ్చి, అచ్చాతో నికాయ్ చేయించారు. కాని అప్పటికే అచ్చాకు మూడు నెలలు కడుపని బుడన్‌ఖాన్‌కి తెలిసిపోయింది. వాడు ఎదురు తిరిగాడు. అచ్చాని ఏలుకోనన్నాడు. డబ్బాశ చూపించినా లొంగలేదు. కాని నవాబ్ గారికి భయపడి పారిపోయాడు. మళ్ళీ రాలేదు. ఆ తరవాత ఆర్నెల్లకు నువ్వు పుట్టావు. అదేం చిత్రమో గాని ఈ లోపున నవాబ్ బేగం గర్భం దాల్చింది. నీ తరవాత మూడు నెలలకు నవాబ్ పాషాను కన్నది. తన దగ్గర సరిగ్గా పాలు లేక అచ్చానే నవాబ్‌పాషాకు పాలివ్వటానికి కుదుర్చుకుంది."

"అయితే... నవాబ్ బేగంకు అసలు సంగతి తెలిసే తెలీదా?"

"అప్పటికి తెలీదు. కాని తరవాత తరవాత తెలుసుకుంది. ఎలా పసి కట్టిందో పట్టేసింది. అప్పట్నించి అచ్చానూ, నిన్నూ ద్వేషించటం మొదలెట్టింది. చేతనైతే మిమ్మల్నిందర్నీ ఏనాడో దేవిడీ నించి తరిమేసేదే, కాని నవాబ్ సాబ్ పడనివ్వలేదు."

పాపా మెదడులో ఏవో వూహాలు మెలరేగాయి. గర్వంతో తల పైకి లేచింది.

"అయితే, బాబా నేను... నేను నవాబ్‌సాబ్ పెద్దకొడుకునన్న మాట... నవాబ్‌పాషాకు అన్నను."

బాబా మాట్లాడలేదు.

"ఏం బాబా" అంటేనదా

ఒక విధంగా చూస్తే అంతేబాబూ ..."

"మరి... మరి నేను కూడా వారసుణ్నే కదూ?"

బాబా చకితుడయ్యాడు. భయంగా జాలిగా పాపాకేసి చూశాడు.

"వద్దు బాబూ, వద్దు. అంతంత పెద్ద ఆశలు పెట్టుకోకు."

"ఏం—ఎందుకని?"

"నువ్వు నవాబ్ గారి వారసుడవు కాలేవు."

"ఎందుక్కాలేనూ?"

"నవాబ్‌సాబ్ మీ అమ్మను పెళ్ళి చేసుకో లేదు. ఆఖరికి బాహాటంగా ఉంచుకొన్నైనాలేదు. లోకం దృష్టిలో నువ్వు బుడన్‌ఖాన్ కొడుకువే."

"అబద్ధం—అది పచ్చి అబద్ధం."

"కావచ్చు. కాని రుజువు చెయ్యలేవు."

"చేస్తాను. మీరే దానికి సాక్షులు. సాక్ష్య మిస్తారుగా?"

"ఇవ్వను. ఇచ్చినా నీకు వ్యతిరేకంగా ఇస్తాను. నేను నవాబ్‌సాబ్ ఉప్పు తిని బ్రతికినవాడినని మరిచిపోకు."

పాషా కట్టుకుంటున్న కలల గూడు కూలి పోయింది.

"చూడు, బాబూ!" మళ్ళీ అందుకున్నాడు బాబా—"పెద్దవాణ్ణి చెబుతున్నాను. నా మాట విను. నవాబ్‌సాబ్ చాలా మంచివారు. రాత్రి మీ అమ్మ కిచ్చిన మాట నిలబెట్టుకుంటారు. నిన్ను పెద్దవాణ్ణి చేసి తప్పకుండా నీకు దారి చూపిస్తారు. తొందరపడి ఆయనతో అనవసరంగా తగాదా తెచ్చుకోకు. నువ్వే నష్టపోతావ్. పెద్దవాళ్ళ రాగ ద్వేషాలు రెండూ తీవ్రంగానే ఉంటాయి."

ఇంతలో అక్కడికో కారొచ్చి ఆగింది. అందులోంచి నవాబ్‌సాబ్ దిగటం చూసి ఇద్దరూ దిగ్గ్రమతో లేచి నిలుచున్నారు. నవాబ్‌సాబ్ మెల్లిగా వచ్చి పాషా భుజం చుట్టూ ఆప్యాయంగా చెయ్యి వేసి నడిపించుకెళ్ళి కార్లో కూచోబెట్టారు. బాబాను ముందు సీట్లో కూచోమన్నారు. కారు కదిలింది. . .

అది జరిగి అయిదేళ్ళయింది. ఈలోగా ఎన్నో సంఘటనలు జరిగాయి. వాటిలో ముఖ్యమైంది నవాబ్ బేగం మరణం. ఆనాడు మొట్ట మొదటి సారి స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునాడ్ను. పాషా. తల్లి ఎడబాటు భరించలేని నవాబ్‌పాషా మంచాన పడ్డాడు. కొంత కోలుకున్నాక, వాళ్ళ బాబాయి చోటే నవాబు తన వెంట తీసుకెళ్ళిపోయాడు. అక్కడే చదువు సాగించాడు నవాబ్‌పాషా.

**బలాబలాలు**

**అవివేకుల ద్వేషం శత్రుత్వం కాదు; సమర్థుల మధ్య ఏర్పడేదే నిజమైన వైరం.**

— గే

---

నవాబ్‌సాబ్ ఒంటరి వా డయ్యాడు. అన్నిటికీ పాషా మీద ఆధారపడుతున్నాడు. ఇంట్లో పాషా పరపతి పెరిగింది. అయినా తన హద్దులు మీరి ఎన్నడూ ప్రవర్తించలేదు.

నవాబ్ పాషా సెలవుల్లో ఇంటికి వస్తూ ఉండే వాడు. ఇంటి వ్యవహారాల్లో పాషా జోక్యం కలిగించుకోటం చూసి సహించేవాడు కాదు. తన ఆగ్రహాన్ని అన్ని విధాలా స్పష్టం చేస్తూ ఉండేవాడు. తండ్రితో ఫిర్యాదులు కూడా చేసే వాడు. కాని నవాబ్‌సాబ్ మందహాసంతో మౌనం వహించేవాడు. ఎవర్నీ ఏమీ అనేవాడు కాదు.

నవాబ్‌పాషాతో తనను పోల్చుకోవటం పాషాకు అలవాటుగా మారింది. నవాబ్‌పాషా తెల్లగా నాజూగ్గా అంతా నవాబ్ బేగం పోలిక. తన రంగు తెలుపు కాదు; చామనచాయ. కాని దృఢంగా కండలు తేలి పహిల్వాన్‌లా ఉంటాడు. కను ముక్కు తీరంతీ నవాబ్‌సాబ్ పోలిక. అలా అనుకోగానే గర్వంతో హృదయం పొంగిపోయేది. కాని వెంటనే నవాబ్ సాబ్‌కు అసలు వారసుడు తాను కాదు, నవాబ్‌పాషా అని తలంపు రాగానే కుంగిపోయేవాడు. నవాబ్‌పాషా మీద పట్టరాని కోపం వచ్చేది. ఒక్కసారి, కేవలం ఒక్కసారి నవాబ్‌పాషాను ఓడించాలి. ఏ ఒక్క విషయంలోనైనా సరే, తాను ఓడించగలగాలి. అదే తన ధ్యేయం. అప్పుడు కాని తన కడుపు మంట చల్లారదు.కాని. . .కానిఎలా? ఎలా పగ సాధించటం? తన అసహాయ స్థితికి వగస్తూ కూచునేవాడు.

నవాబ్‌పాషా చదువు ముగిసిందనీ, ఇక వచ్చి ఇక్కడే ఉండిపోతాడనీ నవాబ్‌సాబ్ చెప్పినప్పుడు బాధపడాలో, సంతోషించాలో తెలీలేదు పాషాకు. ఇక రోజూ నవాబ్ పాషా చేసే అవమానాలకు గురి కావాలేమో అన్న వ్యథ ఒకవేపు బాధిస్తూంటే, మరో వేపు తన చిరకాల వాంఛ తీరే అవకాశం చేజిక్కుతుందేమోనన్న ఆశ కూడా కలుగుతూంది.

ఆ తర్వాత నవాబ్ పాషా పెళ్ళి అక్కడే బాబాయి కూతురు గుడ్డీరాణితో జరగబోతుందని తెలియ గానే ఎందుకో మనసంతా అల్లకల్లోలమైంది. ఒక నిట్టూర్పు విడిచి ఊరుకున్నాడు. పెళ్ళికి రమ్మని నవాబ్‌సాబ్ అడిగితే, ఏదో ఒక మిష చెప్పి తప్పించు కున్నాడు.

పెళ్ళయాక వారం రోజులకి నవాబ్‌సాబ్ తిరిగి వచ్చేశాడు. మరో పదిహేను రోజుల తరవాత నవాబ్ పాషా, దుల్హన్‌పాషాగా మారిన గుడ్డీరాణీ వచ్చా రు. కూడా గుడ్డీరాణీ తల్లిగారు వచ్చి అయిదారు రోజు లుండి వెళ్ళిపోయారు.

దుల్హన్‌పాషా ఇంట్లో అడుగు పెట్టినప్పటి నించీ జనానాలోకి కాలు పెట్టడం మానేశాడు పాషా. వారం—పది రోజులు దాటిపోయాయి. ఆఖరికి ఈనాడు దుల్హన్‌పాషా పిలుపు మేరకు వెళ్ళాడు. చెంప దెబ్బ, తిట్లూ తిని వచ్చాడు. ఇన్నాళ్ళూ భరించిన అవమానాలు ఒక ఎత్తు; ఈ రోజు దుల్హన్‌పాషా ఎదుట జరిగిన అవమానం మరో ఎత్తు. ఇది సహించరానిది. సహించలేడు. ప్రతీకారం చేసి తీరాలి. . .ఏం చెయ్యాలి?. . .ఏం చెయ్యాలి?. . . ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా ఏమీ పాలు పోలేదు.

ఏదో అలికిడైై తలెత్తి చూశాడు. చీకటి పడ్డది. గుమ్మంలో నిలుచుని ఉంది చమ్కీ. చేతిలో అన్నం పళ్ళెం ఉంది. చమ్కీని చూడగానే కోపం అవధులు దాటింది. "ఛత్, పో ఇక్కడ్నించి" అంటూ లేచాడు, చెయ్యెత్తి కొట్టబోతూ. అది చూసి భయపడి పారి పోయింది చమ్కీ. చతికిలబడి, నేలమీద వెల్లకిలా పడుకున్నాడు, చూరుకేసి చూస్తూ. ఎప్పుడు కునుకు పట్టిందో తెలీదు. . .

"పాషా!. . .పాషా!" అన్న మెల్లని పిలుపుకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచాడు. మసక మసక చీకట్లో ప్రక్కనే కూచుని తిన్నగా కుదుపుతూన్న ఒక యువతి ఆకారం కనిపించింది. వెంటనే 'చమ్కీ' అంటూ లేవబోయాడు. ఉంగరాలతో నిండిన మృదువైన వేళ్ళు నోటి కడ్డంగా వచ్చి లేవ నివ్వలేదు.

"ఉష్! మాట్లాడకు" తగ్గు స్వరంతో మత్తుగా అంటూంది—"నేను చమ్కీని కాదు. గుడ్డీరాణీని. ."

"ఆఁ?" సంభ్రమాశ్చర్యాలతో తబ్బిబ్బయాడు పాషా. "గుడ్డీరాణీ'?. . .దుల్హన్‌పాషా?. . .మరి. . మరి. . . నవాబ్‌పాషా?. . ."

"ఉష్! ఆ పిచ్చి మాట ఎత్తకు" అంటూ పెదాల మీద పెదాలు అన్చి నోరు మూసింది.

పాషా మెదడులో వెయ్యి దీపాలు వెలిగాయి. గుండెలో జయభేరి మ్రోగింది. మనసులోనే, "నవాబ్‌పాషా! . . . నవాబ్‌పాషా! . . . గెలుపు నాదే నాదే" అనుకుంటూ, దుల్హన్‌పాషాను తన బాహు బంధాల్లో కసిగా బంధించాడు. ★